www.samasamajam.in

# సమ సమాజం

ఆది వారం 29-1-2023

సంపుటి - 07, సంచిక-244
పేజీలు - 4 వెల రూ. 5/-

SAMA SAMAJAM TELUGU DAILY NEWS PAPER

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole



## తెలంగాణ ఆర్టీసీ వినూత్న ప్రయోగం

ప్రయోగాత్మకంగా 9 బస్సుల్లో రేడియో ఏర్పాటు

టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ ప్రారంభం

## కూలిన రెండు యుద్ధ విమానాలు

సురక్షితంగా బయటపడ్డ పైలెట్లు

మధ్యప్రదేశ్ మొరేనా ప్రాంతంలో కూలినట్లు వెల్లడి

రాజస్థాన్‌లో మరో ఛార్టెడ్ విమాన ప్రమాదం



**న్యూఢిల్లీ, జనవరి 28 (సమ సమాజం):** భారత వాయుసేనకు చెందిన మూడు యుద్ధ విమానాలు శనివారం కుప్పకూలాయి. మధ్యప్రదేశ్‌లో శిక్షణలో ఉన్న రెండు ఫైటర్ జెట్లు, రాజస్థాన్‌లో మరో యుద్ధవిమానం ప్రమాదానికి గురైనట్లు రక్షణశాఖ అధికారులు వెల్లడించారు. రోజువారీ శిక్షణలో భాగంగా మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్

3లో

## గిరిజన విద్యార్థి ప్రాణం విలువ ఐదు లక్షలా!

సరూర్ నగర్ కార్పోరేటర్ శ్రీవాణీ అంజన్



**హైదరాబాద్, జనవరి 28 (సమ సమాజం):** విఎం హోమ్‌లో చదువుతున్న విద్యార్థి ఆత్మహత్య నేపధ్యంలో బాధిత కుటుంబం తరఫున సరూర్‌నగర్ కార్పోరేటర్ శ్రీవాని అంజన్ ఆందోళనకు దిగారు. విద్యార్థి ఆత్మహత్య అనుమానాస్పదంగా ఉండటంతో సంఘటన స్థలానికి చేరుకొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీవాని మాట్లాడుతూ.. తెలంగాణలో పేద గిరిజన విద్యార్థి హరినాయక్ ప్రాణం విలువ ఐదు లక్షలు మాత్రమేనా అని ప్రశ్నించారు. విద్యార్థి మృతికి గల కారణం ఎవరు..?. మంత్రి సబితమ్మ ఈ యొక్క విషయాన్ని బాగా కవర్ చేశారు అని దుయ్యబట్టారు. విఎం హోమ్‌లో చదువుకుంటున్న విద్యార్థి ఆత్మహత్య అనుమానాలను నివృత్తి చేయాల్సి బాధ్యత విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిదేనని, ప్రభుత్వ స్కూళ్లలో పిల్లలకు మంచి భోజనం సంగతి అటుంటే ప్రాణాలకు రక్షణ కరువైందని అన్నారు.

# కేటీఆర్ నోట ముందస్తు మాట!

## ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధమే



- రాష్ట్రంలో 60 లక్షల మంది రైతులకు రైతుబంధు
- ఇప్పటివరకు రూ.65 వేల కోట్ల రైతుబంధు సాయం
- ఎనిమిదేండ్లలో 46 వేల చెరువులను పునరుద్ధరించాం
- నాలుగేళ్లలోనే కాళేశ్వరాన్ని అతితక్కువ సమయంలో నిర్మించాం
- 45 లక్షల ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు సరఫరా
- 3.5 కోట్ల టన్నుల ధాన్యం పండించే స్థాయికి చేరుకున్నాం
- టెక్నాలజీ విషయంలో ఇండియా ఇంకా వెనుకబడే ఉంది
- ఇన్నోవేషన్‌లో తెలంగాణ ఎంతు ముందుంది
- నిజామాబాద్ పర్యటనలో మంత్రి కెటిఆర్ వెల్లడి
- కెటిఆర్ కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేసిన ఎన్ఎస్‌యూఐ
- అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు కెటిఆర్ శ్రీకారం

**నిజామాబాద్,జనవరి 28 (సమ సమాజం):** రాష్ట్రంలో 60 లక్షల మంది రైతులకు రైతుబంధు ఇస్తున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. ఇప్పటివరకు రూ.65 వేల కోట్ల రైతుబంధు సాయం అందించామని చెప్పారు. నిజామాబాద్ పట్టణంలో కాకతీయ స్యాండ్ బాక్స్ ఆధ్వర్యంలో జరిగిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఎనిమిదేండ్లలో 46 వేల చెరువులను పునరుద్ధరించామ న్నారు. ప్రపంచంలో అతిపెద్ద ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరాన్ని అతితక్కువ సమయంలో నిర్మించామన్నారు. 45 లక్షల ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు అందుతున్నదని చెప్పారు. 2014లో తెలంగాణలో 68 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే పండిందని, 2022 నాటికి 3.5 కోట్ల టన్నులు పండించే స్థాయికి చేరుకున్నామని వెల్లడించారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో నష్టాల్లో ఉన్న విజయ డెయిరీ లాభాల బాటపట్టిందని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు నిత్యం ఆదాయం సమకూరు తుందని చెప్పారు. 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు

3లో

## తిరిగి ప్రారంభమైనా రాహుల్ జోడోయాత్ర

యాత్రలో రాహుల్‌తో కలసి నడిచిన మెహబూబా ముఫ్తీ



**శ్రీనగర్, జనవరి 28 (సమ సమాజం):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర జమ్మూ కాశ్మీర్‌లోని అవంతిపొరా నుండి తిరిగి ప్రారంభమయ్యింది. ఈ యాత్రలో రాహుల్ గాంధీతో కలిసి పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ పాల్గొన్నారు. రాహుల్ యాత్రకు మద్దతు పలికారు. జమ్మూ కశ్మీర్‌లో కొనసాగుతోన్న రాహుల్ పాదయాత్ర భద్రతా కారణాల దృష్ట్యా శుక్రవారం రద్దయింది. పాదయాత్రలో భాగంగా రాహుల్ బనిహాల్ టన్నెల్ క్రాస్ అవుతుండగా ఆయన్ని చూసేందుకు జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. అయితే జనాన్ని నియంత్రిం చాల్సిన స్థానిక పోలీసులు అకస్మాతుగా అదృశ్యమయ్యారు. దీంతో జనసముదాయాన్ని నియంత్రించడంలో లోపాలున్నట్లు గుర్తించిన రాహుల్ సెక్యూరిటీ

3లో

## ఫ్లోరైడ్ బాధితులు అంశాల స్వామి మృతి

సంతాపం ప్రకటించిన సిఎం కెసిఆర్, మంత్రులు

అంతిమ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కూసుకుంట్ల



**నల్లగొండ, జనవరి 28 (సమ సమాజం):** ఫ్లోరోసిస్ బాధితుడు, పోరాటయోధుడు అంశాల స్వామి కన్నుమూశారు. 32 ఏండ్ల స్వామి.. ప్రమాదవశాత్తు బైక్‌పైనుంచి పడి చనిపోయారు. నల్లగొండ జిల్లా శివన్నగూడెం గ్రామానికి చెందిన స్వామి చిన్నతనంలోనే ఫ్లోరోసిస్ బారినపడ్డారు. ఫ్లోరైడ్ రక్కసిని తరమికొట్టాలని అవిశ్రాంతంగా పోరాడారు. ఫ్లోరైడ్ బాధితుల తరపున గళం వినిపించారు. శుక్రవారం సాయంత్రం తన ఇంటివద్ద ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి స్వామి కిందపడిపోయారు. దీంతో మెడకు గాయమవడంతో స్థానికంగానే చికిత్స చేయించుకున్నారు. అయితే పరిస్థితి విషమించడంతో శనివారం ఉదయం ఆయన తుదిశ్వాస విడిచారు. ఫ్లోరోసిస్ బాధితుడు స్వామి మృతిపట్ల సీఎం

3లో

## కవితను కలుసుకున్న నటుడు శరత్ కుమార్

బిఆర్ఎస్ ఏర్పాటు తదితర అంశాలపై చర్చ



**హైదరాబాద్, జనవరి 28 (సమ సమాజం):** ప్రముఖ నటుడు, ఆల్ ఇండియా సమతావ మక్కల్ కచ్చి అధ్యక్షుడు శరత్ కుమార్ ఎమ్మెల్సీ కవితతో భేటీ అయ్యారు. హైదరాబాద్‌కు వచ్చిన శరత్ కుమార్ నేరుగా కవిత నివాసానికి వెళ్లి ఆమెతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుత దేశ రాజకీయాలు, ఇతర అంశాలపై ఇరువురు చర్చించారు. బీఆర్ఎస్ పార్టీ స్థాపన ఉద్దేశాలు, లక్ష్యాలు, ఎజెండా వంటి అంశాల గురించి శరత్ కుమార్.. కవితను అడిగి తెలుసుకున్నారు. ఇరువురు నేతలు ప్రస్తుత దేశంలోని రాజకీయాలపై చర్చించారు. తమిళనాడులో బిఆర్ఎస్ ఏర్పటు గురించి కూడా కవిత ప్రస్తావించినట్లు సమాచారం.



## లిక్కర్ స్కామ్ నిందితుడు సమీర్ మహేంద్రుకు ఊరట

ఫైళ్ల వివరాలు బయటపెట్టొద్దన్న వినతికి అంగీకారం

**న్యూఢిల్లీ, జనవరి 28 (సమ సమాజం):** లిక్కర్ స్కాంలో నిందితుడిగా ఉన్న సమీర్ మహేంద్రు కోర్టును ఆశ్రయించాడు. సోదాల్లో భాగంగా ఈడీ, సీబీఐ అధికారులు

3లో



స్కాలర్‌షిప్‌ల కోసం

## విద్యార్థుల ఆందోళన

**జగిత్యాల, జనవరి 28 (సమ సమాజం):** పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్‌లు వెంటనే విడుదల చేయాలని రోడ్డుపై బైఠాయించి విద్యార్థులు ఆందోళన చేశారు. జగిత్యాలలో కొత్త బస్టాండ్ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ జిల్లా

3లో

## విషమంగా తారకరత్న ఆరోగ్యం

ఎక్మో ద్వారా శ్వాస అందిస్తున్న వైద్యులు



**బెంగళూరు, జనవరి 28 (సమ సమాజం):** సినీనటుడు, టీడీపీ నాయకుడు నందమూరి

3లో

## కామారెడ్డి గిరిజన బాలిక అరుదైన ఘనత

కిల్లిమంజారో పర్వతాన్ని అధిరోహించి రికార్డు

**కామారెడ్డి, జనవరి 28 (సమ సమాజం):** జిల్లాకు చెందిన ఓ గిరిజన బాలిక అరుదైన ఘనత సాధించింది. 26న టాంజానియాలోని కిలిమంజారో పర్వత శిఖరాన్ని అధిరోహించింది. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం, సోమవరం పేట గ్రామానికి చెందిన బానోత్ వెన్నెల ఈ అరుదైన ఘనత సాధించింది. బాల్యం నుంచే పర్వతారోహణపై ఇష్టం పెంచుకున్న వెన్నెల అందుకు అవసరమైన శిక్షణ తీసుకుంది. జనవరి 19న యాత్ర ప్రారంభించి జనవరి 26న కిలిమంజారో పర్వత శిఖరం చేరుకుంది. అక్కడ మువ్వన్నెల జెండా ఎగురవేసింది. వెన్నెల కిలిమంజారో పర్వతం అధిరోహించిన అనంతరం గ్రీన్ ఇండియా ఛాలెంజ్ పోస్టర్ తో ఫొటోలు దిగింది. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్ ఆమెకు శుభాకాంక్షలు చెప్పారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ గురించి ప్రపంచానికి తెలియజేసినందుకు అభినందించారు. కిలిమంజారోను





3లో

## డిజిపి కార్యాలయ ముట్టడికి బిజెవైఎం యత్నం

తోపులాటలో బిజెవైఎం నేత భానుప్రకాశ్‌కు గాయాలు

ఆస్పత్రికి తరలించి చికిత్స.. పోలీసులపై మండిపడ్డ బండి సంజయ్



**హైదరాబాద్, జనవరి 28 (సమ సమాజం):** ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు మద్దతుగా బీజేవైఎం చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. డీజీపీ ఆఫీసు ముట్టడికి వెళ్లిన నేతలు, కార్యకర్తలు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటనలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్ కు గాయాలయ్యాయి. హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు మార్కులు కలిపి న్యాయం చేయాలని బీజేవైఎం నేతలు డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ముట్టడికి వచ్చిన కార్యకర్తల్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో నిరసనకారులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. పోలీసులు పలువురు బీజేవైఎం నేతలను పోలీసులు తీసుకుని స్టేషన్ కు తరలించారు. ఇదిలావుంటే డీజీపీ కార్యాలయం ముట్టడిలో బీజేవైఎం నేతలు, కార్యకర్తలు తీవ్రంగా గాయపడటంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ స్పందించారు. పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన చేస్తే అమానుషంగా వ్యవహరిస్తారా అని ప్రశ్నించిన ఆయన కేసీఆర్ సర్కారుకు పోయే కాలం వచ్చిందని అన్నారు.

## బీఅర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ రెండో ఛార్జీ షీట్

హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ పై చార్జీ షీట్



విడుదల చేసిన ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, హాథ్ సే హాథ్ జోడో అభియాన్ మానిటరి కమిటీ సభ్యులు నిరంజన్, పాల్వాయి స్రవంతి, మదన్ మోహన్, కైలాష్, భరత్ చౌహన్

**హైదరాబాద్, జనవరి 28 (సమ సమాజం):** గాంధీభవన్లో ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమీటి ఛైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం హాథ్ సే హాథ్ జోడో అభియాన్ మానిటరి కమిటీ సమావేశం అనంతరం కార్యక్రమంలో భాగంగా టిఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యాలపై చార్జిషీట్ విడుదల చేయడం జరిగింది. బీఅర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు, వైద్య ఆరోగ్య శాఖలో వైఫల్యాలు, కొత్త సచివాలయం, పార్టీ కార్యాలయాలు, క్యాంప్ ఆఫీస్‌ల మీద సీఎం కేసిఆర్‌కు ఉన్న ప్రేమ, ప్రజారోగ్యం పై ఎందుకు లేదని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మన్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. 2018 ఎన్నికల్లో ఆరోగ్య తెలంగాణ చేస్తామన్న సీఎం కేసిఆర్ ఆరోగ్యశాఖకు బడ్జెట్‌లో కేటాయించా

2లో

# కేటీఆర్ నోట ముందస్తు మాట!



విస్తరణ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు నడుస్తున్నదని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని పేర్కొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తున్నామన్నారు. టెక్నాలజీ విషయంలో ఇండియా ఇంకా వెనుకబడి ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. ఇన్నోవేషన్ లో తెలంగాణ ముందు వరుసలో ఉన్నదని చెప్పారు. 'ప్రపంచంలోనే అతిపెద్ద ఇరిగేషన్ ప్రాజెక్ట్ ను నాలుగేళ్లలో నిర్మించామని, లక్ష కిలోమీటర్ల పైప్‌లైన్‌వేసి మిషన్ భగీరథ ద్వారా కోటి ఇళ్లకు మంచినీరు అందిస్తున్నామని చెప్పారు. రూరల్ ఏరియాలకు ఐటీని విస్తరించడంతో పాటు రైతులకు ఫ్రీ కరెంట్ ఇస్తున్నామని అన్నారు. ప్రతి ఇంటికీ ఫైబర్ కనెక్షన్ ఇచ్చే కార్యక్రమం చేపట్టినట్లు కేటీఆర్ ప్రకటించారు. రాష్ట్రం నుంచి ఐటీ ఎగుమతులు రూ.లక్షా 18 వేల కోట్లకు పెరిగాయని చెప్పారు. అయితే టెక్నాలజీ పరంగా భారత్ ఇంకా వెనుకబడి ఉన్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. జనాభాకు తగ్గట్టుగా అభివృద్ధి సాధించడంలో చైనా ఆదర్శమని చెప్పారు. ఇన్నోవేషన్ రంగంలో తెలంగాణ ముందు వరుసలో ఉన్నదని తెలిపారు. టెక్నాలజీ ఫర్ ఇంప్యాక్ట్ పేరుతో స్యాండ్ బాక్స్ సంస్థ ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యాక్రమంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే బిగాల గణెశిశ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే జిల్లా కేంద్రంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌కు నిరసన సెగలు తగిలాయి. కంటేశ్వర్ చౌరస్తాలో మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌ను కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నేతలు అడ్డుకున్నారు. కాంగ్రెస్ కార్పొరేటర్ గడుగు రోహిత్ ఆధ్వర్యంలో కేటీఆర్ వాహనాల ఎదుట నిరసనకు దిగారు. పోలీసుల రక్షణ వలయాన్ని దాటుకుని వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేటీఆర్ పర్యటన నేపథ్యంలో ముందస్తుగానే ప్రతిపక్ష, విద్యార్థి, ప్రజాసంఘాల నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాసేపటి క్రితమే హెలికాప్టర్‌లో జిల్లా కేంద్రానికి చేరుకుని కేటీఆర్... న్యూ కలెక్టరేట్ మైదానం నుంచి రోడ్డు ద్వారా భూమా కన్వెన్షన్‌కు చేరుకున్నారు.

# ఫ్లోరైడ్ బాధితులు అంశాల స్వామి మృతి



కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. ఫ్లోరోసిస్ సమస్య అనగానే స్వామి పేరు గుర్తుకొస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో స్వామి పోరాటం ఎందరికో స్ఫూర్తిగా నిలిచిందని వెల్లడించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంశాల స్వామి మృతిపట్ల మంత్రి కేటీఆర్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. బాధితుడైన స్వామి ఎ÷-లోరైడ్ సమస్యపై అవిశ్రాంతంగా పోరాడారు. ఆయన ఎంతో మందికి స్ఫూర్తి. ఎప్పటికీ తన మనసులో గుర్తుండిపోతాడు. అతని ఆత్మకు శాంతి చేకూరాలి' అని ట్వీట్ చేశారు. అంశాల స్వామి మృతికి మంత్రి జగదీశ్ రెడ్డి కూడా సంతాపం ప్రకటించారు. ఆయన పోరాటం మరువలేనిదన్నారు. ఈ కారణంగానే కెసిఆర్ నల్లగొండలో ఫ్లోరైడ్ నిర్మూలనకు చర్యలు తీసుకున్నారని అన్నారు.

## లిక్కర్ స్కామ్ నిందితుడు సమీర్ మహేంద్రుకు ఊరట

బయటపెట్టొద్దని ఆదేశించాలంటూ రౌస్ ఎవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఛార్జ్ షీటులోని సమాచారం బయటకు వెళ్తే తన వ్యాపారాలకు ప్రమాదమని, 1,97,000 మెయిల్స్ ను ప్రత్యర్థులు ఉపయోగించుకునే అవకాశముందని కోర్టు దృష్టికి తెచ్చారు. రహస్య ఒప్పందాలు లీకైతే న్యాయపరమైన ఇబ్బందులు వస్తాయని సమీర్ మహేంద్రు తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. అందుకే కంపెనీల వ్యక్తిగత సమాచారం బయటపెట్టకుండా చూడాలని ఆదేశించాలని కోరారు. పిటిషనర్ వాదనలు విన్న న్యాయమూర్తి సమీర్ మహేంద్రు విజ్ఞప్తికి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.


## స్కాలర్‌షిప్‌ల కోసం విద్యార్థుల ఆందోళన

కౌన్సిల్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం 10 శాతం.. రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం ఈ బ్జడెట్లో విద్యా రంగానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా మెస్ / కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలన్నారు. గత 3సంవత్సరాల నుండి స్కాలర్ షిప్స్ ఫీజు రీయింబర్స్మెంట్ అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. తమ సమస్యలను పరిష్కరించాలని..లేకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# కెసిఆర్ అసలుసిసలు హిందువు

రాష్ట్రంలో ఎన్నో దేవాలయాలు పునరుద్దరించారు
పర్వతాల ఆలయ పునఃప్రతిష్టలో పాల్గొన్న హరీష్ రావు
త్వరలోనే వైద్యకళాశాలల ప్రొఫెసర్ల రిక్రూట్‌మెంట్
వరంగల్ పర్యటనలో మంత్రి హరీష్ రావు వెల్లడి
శరవేగంగా వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి
అద్భుతంగా నిర్మాణం సాగుతోంది

**జనగామ, జనవరి 28 (సమ సమాజం):** కేసీఆర్ నిజమైన హిందువని మంత్రి హరీశ్ రావు అన్నారు. కొంతమంది హిందువులంటూ ప్రచారం చేసుకుంటారు కానీ..కేసీఆర్ హిందూధర్మ ప్రచారకుడని అన్నారు. ఎన్నో దేవాలయాలను కేసీఆర్ కాపాడారని చెప్పారు. వరంగల్ జిల్లాలోని పర్వతాల ఆలయ పున:ప్రతిష్ట కార్యక్రమానికి హరీశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. పర్వతాల శివాలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ ఆలయం గురించి సీఎం కేసీఆర్ కు వివరిస్తామని చెప్పారు. కాకతీయు పురాతన శివాలయం తిరిగి కట్టడం గొప్ప విషయమన్నారు. పురాతన ఆలయాన్ని పునరుద్దరించడం వంద కొత్త ఆలయాలు కట్టడంతో సమానమని అన్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి పర్వతాల ప్రాంతంలో కాకతీయుల నాటి శివాలయంలో లింగ పునః ప్రతిష్టాపన కార్యక్రమాలు శనివారం వేద మంత్రోచ్చారణల మధ్య కొనసాగింది. రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఉషా దయాకర్ రావు దంపతులు, తదితరులచే యంత్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. లింగానికి పూజాదికాలు నిర్వహించి ప్రతిష్టాపన చేశారు.లింగ పున: ప్రతిష్ట పూర్తి కావడంతో వేలాదిగా భక్తులు శివలింగ దర్శనం చేసుకుంటూ అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా శనివారం నుంచి పర్వతాల శివాలయం జాతర ప్రారంభమయ్యింది. శివక్షేత్రం పీఠాధిపతి శివస్వామి ఆధ్వర్యంలో కల్యాణం, పూర్ణాహుతి, పూజా కార్యక్రమాలు జరిగాయి. ప్రతి రెండు గంటలకు ఒకసారి వందలాది మంది పాఠశాల విద్యార్థులతో శివనామ స్మరణను కొనసాగించారు. ప్రారంభమైన పర్వతాల శివాలయం జాతరకు ప్రతి ఒక్కరూ వచ్చి, శివున్ని అభిషేకించి పరమేశ్వరుని కరుణకు పాత్రులు కావాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు భక్తులను కోరారు. సాయంత్రం సంగీత విభావరి,




సాంస్కృతిక కార్యక్రమాలు, సినీ నేపథ్య గాయని సునీతతో పాటల కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ యంత్రాభిషేకం లో ఎమ్మెల్యే అరూరి రమేశ్, సర్పంచ్ సోమేశ్వర రావు, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఇతర ప్రజా ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యమ వస్తువుగా ఉప్పు

మహాత్ముడి పోరాటానికి తలవంచిన బ్రిటీషర్లు

గాంధీ వర్ధంతి సందర్భంగా ..





**న్యూఢిల్లీ, జనవరి 28 (సమ సమాజం):** తాను నమ్మిన అహింసా సిద్దదాంతం కావచ్చు లేదా... ఉద్యమపంథా కావచ్చు...ఆచరించి బ్రిటిషు వారికి వ్యతిరేకంగా గాంధీ పోరాటం చేశారు. బ్రిటిషు వారిచేతనే భేష్ అనిం పించుకోవడమే గాకుండా వారిని గడగడలా డించిన మహానుభావుడు మన మహాత్మా గాంధీ స్వాతంత్ర్యానంతరం జనవరి 30న గాంధీజీ హత్యకు గురయ్యారు. ఆయన మత్య దేశాన్నే కాదు ప్రపంచాన్ని కదిలించింది. ఆయన మార్గం నేటికీ ప్రపంచ దేశాలకు అనుసరణీయంగా మారింది. గాంధీ ప్రత్యేకత అంటే అదే. ఆయన తను చెప్పిన సిద్ధాంతాన్ని ఆచరించారు గనుకనే అశేషమైన ప్రజల మద్దతు సాధించగలిగారు. దేశ ప్రజల ఆలోచన స్థితిని, వారి చైతన్యాన్ని గుర్తించి వారిని ఉద్యమంలోకి రప్పించాలో గ్రహించిన గాంధీ స్వాతంత్ర్యాన్ని సాధించగలిగారు. అందుకే ఆయన నాటి భారత సమాజాన్ని కదలిం చేందుకు చాలా చిన్నచిన్న విషయాలనే ఎంచుకున్నారు. అంతే కాదు ప్రజల నిత్య జీవితంపై ప్రభావం చూపించే ఉప్పును ఉద్యమానికి ఆయుధం చేసుకున్న ధీశాలి. నిత్యావసరాలను, అత్యంత ప్రభావం చూపే అంశాలే ఆయన ఉద్యమ ఇతి వృత్తాలు. అందుకే దండి ఉప్పు సత్యాగ్రహం యావత్ దేశాన్ని కదలించింది. అందుకే అంతకు ముందు ఎంతో మంది స్వతంత్ర ఉద్యమాన్ని నడిపినా గాంధీకి ముందు గాంధీ తర్వాత అనే విభజన రేఖ వచ్చింది. అంతలా ఉద్యమాల ను, ప్రజలను, పాలకుల ను గాంధీ ప్రభావితం చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే తెల్లవారిని తరిమి కొట్టేందుకు ఎలాంటి ఆయుధాలు అక్కర్లేకుండా ముందుకు సాగిన ఉక్కు సంకల్పం గాంధీ సొంతం. నాడు బ్రిటిషు ప్రభుత్వంపై యుద్ధం చేయడానికి ఆయన అహింసను ఆయుధంగా చేసుకు న్నాడు కనుకనే బలవంతులైన వారిని ఎదిరించ గలిగారు. ప్రజలు కూడా ఎక్కడిక్కడా అహింసతో అడ్డుకున్నారు. గోచీ పెట్టుకున్న ఈ పెద్దాయన తో తమకు పేచీ లేదని బ్రిటిషు పాలకులు భావించేలా చేశారు గాంధీ. కానీ ఆయనే తన శాంతియుత పద్దతులతో బ్రిటిషర్లను గడగడలాడించాడు. ఆనాటి ఉద్యమాన్ని ప్రత్యక్షంగా చూసిన వారు గాంధీ పట్ల ఆరాధ్య భావం పెంచుకున్నారు. ఆయన ఉద్యమానికి ముగ్ధులయ్యారు. ఇంతటి అసాధారణ ప్తరిభ కలిగిన ఓ వ్యక్తి రక్త మమాంసాలతో ఈ భూమ్మీద జీవించాడంటే నమ్మలేకపోతున్నా మంటూ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ గాంధీ గురించి చేసిన వ్యాఖ్యలు మహాత్ముడి గొప్పతనానికి నిదర్శనాలు. తాను చెప్పిన సిద్ధాంతాన్ని ఆచరించి చూపిన మహనీయుడు బాపు. ప్రజలను తమ సమస్యల పట్ల ముందు కు తీసుకుని వెళ్లాలన్న విషయాలను సూటిగా, భక్తి మార్గంలో, నైతిక మార్గంలో బోధించారు. ఆవే ఆయనను మహాత్ముడిగా నిలబెట్టాయి. చెప్పిన వాటిని ఆచరించడం వల్లనే ప్రపంచ చరిత్రలో ఆయన చిరస్మరణీయమైన వ్యక్తిగా నిలబడ్డాడు.

# కూలిన రెండు యుద్ధ విమానాలు



ఎయిర్ బేస్ నుంచి గాల్లోకి ఎగిరిన సుఖోయ్-30, మిరాజ్ 2000 విమానాలు కాసేపటికే మెరెనా ప్రాంతంలో కూలిపోయాయి. కాగా రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లో వాయుసేనకు చెందిన యుద్ధ విమానం కూలిపోయింది. సమాచారమందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లకు స్వల్పగాయాలయ్యాయి. భారత వైమానిక దళానికి చెందిన రెండు యుద్ధ విమానాలు శనివారం మధ్యప్రదేశ్‌లోని మొరెనా పట్టణ సమీపంలో కూలిపోయాయి. సుఖోయ్-30, మిరాజ్ 2000 విమానాలు కూలిపోయాయి, యుద్ధ విమానాలు కూలిన ప్రాంతంలో రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించామని రక్షణశాఖ అధికార వర్గాలు తెలిపాయి. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కు చెందిన రెండు ఫైటర్ జెట్ విమానాలు కూలిన ఘటనపై విచారణకు ఆదేశించారు. గ్వాలియర్ ఎయిర్ బేస్ నుంచి విన్యాసాలు సాగుతుండగా రెండు ఫైర్ జెట్ విమానాలు కూలిపోయాయని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. శనివారం తెల్లవారుజామున 5.30 గంటలకు రెండు జెట్ విమానాలు కూలాయని మోరీనా జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ ప్రమాదం నుంచి పైలట్‌లు సురక్షితంగా బయటపడ్డారని, వారికి స్వల్ప గాయాలయ్యాయని కలెక్టర్ చెప్పారు. రాజస్థాన్ రాష్ట్రంలోని భరత్‌పూర్‌లో శనివారం చార్టర్డ్ విమానం కుప్ప కూలిపోయింది. సాంకేతిక లోపం కారణంగానే చార్టర్డ్ విమానం కూలిందని అనుమాని స్తున్నారు. విమానం కూలిన సంఘటనస్థలానికి అధికారులు, పోలీసులు హుటాహుటిన తరలివచ్చారు. విమానం కూలిన ప్రాంతంలో సహాయ పునరావాస పనులు చేపట్టామని జిల్లా కలెక్టర్ అలోక్ రంజన్ చెప్పారు

# తెలంగాణలో బిఆర్ఎస్‌కు ఇక విఆర్ఎస్

## వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదు: రాజగోపాల్ రెడ్డి



**నల్లగొండ, జనవరి 28 (సమ సమాజం):** రిపబ్లిక్ డే వేడుకలుజరపకుండా కేసీఆర్ ఓ నియంతలా వ్యవహరిం చాడని మాజీ ఎమ్మెల్యే, బిజెపి నేత రాజగోపాల్ విమర్శించారు. మునుగోడులో మందబలంతో, డబ్బుతో అప్రజాస్వామికంగా గెలిచారని ఆరోపించారు. నైతిక విజయం తనదేనన్నారు. గవర్నర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన పాడి కౌశిక్ రెడ్డి దుర్మార్గుడని..చదువురాని దద్దమ్మ అని రాజగోపాల్ విమర్శించారు. తెలంగాణలో ప్రజాస్వామ్యం ఏవిధంగా ఉందో బీఆర్ఎస్ నాయకుల మాటలు చూస్తే అర్థమవుతోం దన్నారు. టీఆర్ఎస్ ను మార్చుకున్న కేసీఆర్ కి చివరకు వీఆర్ఎస్సేనని ఎద్దేవా చేశారు. తెలంగాణలో ప్రజలు మోడీ వైపు, బీజేపీ వైపే చూస్తున్నారని రాజగోపాల్ రెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. యాదాద్రిజిల్లా ఆత్మకూరు మండలంలో మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి.. కాంగ్రెస్ కు ఓటేస్తే బీఆర్ఎస్ కు వేసినట్టేనని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు వాళ్ల వ్యాపారాల కోసం బీఆర్ఎస్ తో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. నాయకత్వ లోపం వల్ల కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో బలహీనపడిందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఎప్పటికీ ఒక్కటి కాదని..రేవంత్ రెడ్డి ఆలోచించి మాట్లాడాలని హితవు పలికారు. కేసీఆర్ తెలంగాణలో విశ్వాసం కోల్పోయిందన్నారు. ఆయనకు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు.

# తిరిగి ప్రారంభమైనా రాహుల్ జోడోయాత్ర




పాదయాత్రను విరమించుకోవాలని సూచించారు. సెక్యూరిటీ సూచనతో రాహుల్ యాత్రను ఆపేసి నైట్ షెల్టర్‌కు వెళ్లిపోయారు. దీంతో కశ్మీర్ లోయలో 11 కిలోమీటర్లు సాగాల్సిన రాహుల్ యాత్ర ఒక కిలోమిటర్‌కే పరిమితమైంది. తిరిగి శనివారం మళ్లీ ప్రారంభించారు.

# కామారెడ్డి గిరిజన బాలిక అరుదైన ఘనత




అధిరోహించిన భానోత్ వెన్నెల ప్రపంచంలో అతిపెద్దదైన మౌంట్ ఎవరెస్ట్ తన తదుపరి లక్ష్యమని చెబుతోంది. ప్రస్తుతం వెన్నెల కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సాందీపని జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది.

# విషమంగానే తారకరత్న ఆరోగ్యం



తారకరత్న ఆరోగ్యం అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న తారకరత్న ఆరోగ్య పరిస్థితి పై ఆస్పత్రి వైద్యులు మధ్యాహ్నం హెల్త్ బులెటిన్‌ను విడుదల చేశారు. ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో తారకరత్నకు చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తారకరత్నకు ఎక్మో ద్వారా కృత్రిమ శ్వాస అందిస్తున్నామని వివరించారు. గుండె నాళాల్లోకి రక్తప్రసరణ కావడం లేదని, బెలూన్ యాంజియో ప్లాస్టీ ద్వారా రక్తాన్ని పంపింగ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నిన్న కుప్పం నియోజకవర్గం నుంచి యువగళం పేరిట పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్రలో పాల్గొన్న తారకరత్న కొద్దిసేపు నడిచిన అనంతరం తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. కళ్లు తిరిగి పడిపోవడంతో హుటాహుటినా అతన్ని కుప్పంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు పల్స్‌రేట్‌ను పెంచడానికి దాదాపు 45 నిమిషాలపాటు తీవ్రంగా శ్రమించారు. అనంతరం అతడు కోలుకోవడంతో మిగతా పరీక్షలు నిర్వహించి గుండెనాళాల్లో రక్తం పేరుకుపోయిందని గుర్తించి అందుకు తగ్గవిధంగా వైద్య సహాయం అందించారు. వైద్యులు సలహా మేరకు తారకరత్న కుటుంబ సభ్యులు రాత్రి అంబులెన్స్‌లో బెంగళూరుకు తరలించారు. బాలకృష్ణ, చంద్రబాబు కూడా ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. వీరు కూడా బెంగళూరు చేరుకున్నారు.

# సైబరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో కొత్త ఫుట్ బాల్ గ్రౌండ్


### క్రీడలతో మానసికోల్లాసం వస్తుందన్న సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర



హైదరాబాద్,జనవరి 28(సమసమాజం): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన ఫుట్‌బాల్ గ్రౌండ్‌ను శనివారం సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర ప్రారంభించారు. ప్రారంభించిన వెంటనే మొట్టమొదటి మ్యాచ్ జరగడం విశేషం. ఈరోజు జరిగిన ఫుట్బాల్ మ్యాచ్‌లో సివిఆర్ హెడ్ క్వార్టర్స్ లబ లా అండ్ ఆర్డర్ సిబ్బంది హోరాహోరీగా తలపడ్డారు. ఈ ఫుట్ బాల్ మ్యాచ్ లో విన్నరప్‌గా నిలిచిన సైబరాబాద్ హెడ్ క్వార్టర్స్ టీమ్, రన్నరప్ గా నిలిచిన సైబరాబాద్ లా లాండ్ ఆర్డర్ సిబ్బందికి సీపీ బహుమతులు అందజేశారు. అలాగే ఈ మ్యాచ్ లో బెస్ట్ ప్లేయర్ గా సిఆర్ హెడ్ క్వార్టర్స్ పీసీ సందీప్ నిలవగా, మెయిన్ రిఫరీగా హెడ్ కానిస్టేబుల్ ప్రతాప్ నిలిచారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ..పోలీసులు శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి, మానసి కోల్లాసానికి క్రీడలు దోహదపడ తాయన్నారు. క్రీడలు వ్యక్తిలోని నాయకత్వ లక్షణాలను తట్టి లేపడంతో పాటు టీమ్ స్పిరిట్, ఐకమత్యాన్ని పెంచుతాయన్నారు. క్రీడలు మానసిక స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని ఓ జర్మన్ తత్వవేత్త చెప్పిన మాటను ఉదహరించారు. ఆటల్లో గెలుపోటములనేవి సహజమన్నారు. గెలుపోటముల కంటే టీమ్ స్పిరిట్ గొప్పదన్నారు. క్రీడలు మనలో దాగున్న శక్తి సామర్థ్యాలను, పోరాట పటిమను వెలికి తీస్తాయ న్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ కమిషనర్ అవినాష్ మహంతి, డీసీపీ సింగన్వార్ కల్మేశ్వర్, డీసీపీ సైబర్ క్రైమ్స్ రితిరాజ్, విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ డిసిపి కవిత, సిఏఆర్ ఏడిసిపి రియాజ్, సీఎస్ డబ్ల్యూ ఏడీసీపీ వెంకట్ రెడ్డి, ఏడీసీపీ వెల్ఫేర్ శ్రీనివాస్, ఏసీపీలు, సీనియర్ హెడ్ క్వార్టర్స్ సిబ్బంది, మినిస్టీరియల్ స్టాఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ప్రీమియర్ లీగ్‌కు చకచకా ఏర్పాట్లు

### స్పాన్సర్‌షిప్ కోసం బిసిసిఐ బిడ్స్ ఆహ్వానం





ముంబై,జనవరి28(సమసమాజం): మహిళల ప్రీమియర్ లీగ్ మార్చిలో ప్రారంభం కానుంది. ఈ మెగా టోర్నీకి బీసీసీఐ చకచకా ఏర్పాట్లు చేస్తోంది. ఈమధ్యే ఐదు ఫ్రాంచైజీలు రూ.4669.99 కోట్ల భారీ ధరకు ఐదు జట్లను కొనుగోలు చేశాయి. అదానీ స్పోర్ట్స్‌లైన్ ప్రైవేట్ లిమిటెడ్, ఇండియావిన్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, రాయల్ ఛాలెంజర్స్ స్పోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, జేఎస్‌డబ్ల్యూ జీఎంఆర్ క్రికెట్ ప్రైవేట్ లిమిటెడ్, కాప్రి గ్లోబల్ హోల్డింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు వేలంలో మహిళల ప్రీమియర్ జట్లను దక్కించుకున్నాయి. ఇప్పటికే వైకోమ్ సంస్థ ఐదేళ్లకు మహిళల ప్రీమియర్ లీగ్ మీడియా హక్కులు హస్తగతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మహిళల ప్రీమియర్ లీగ్ మొదటి సీజన్ టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కులకు బీసీసీఐ టెండర్లను ఆహ్వానించింది. టెండర్ దక్కించుకన్న కంపెనీకి ఐదేళ్ల కాలానికి (2023-2027) టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కులను కట్టబెట్టనుంది. 'మహిళల ప్రీమియర్ లీగ్ 2023-2027 వరకు టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కుల కోసం బిడ్స్‌ను బీసీసీఐ ఆహ్వానిస్తోంది. బిడ్స్ వివరాలు, షరతులు, టెండర్ పక్రియ, అర్హతలు వంటి వివరాలన్నీ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్‌లో ఉంటాయి. రూ. లక్ష నాన్ రీఫండబుల్ ఫీజు, జీఎస్టీ కలిపి జమ చేసిన వాళ్లకు ఆర్పీఎఫ్ వివరాలు ఫిబ్రవరి 9వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయి' అని ట్విట్టర్‌లో పోస్ట్‌లో పేర్కొంది.




# వినోదయ సిత్తం' రీమేక్‌కు ఓకే

పవర్ స్టార్ పవన్కల్యాణ్ చేతిలో ప్రస్తుతం బోలెడన్ని సినిమాలున్నాయి. వరుస సినిమాలతో ఆయన బిజీగా ఉన్నారు. కొన్ని సెట్స్‌పై ఉండగా మరికొన్ని స్క్రిప్ట్ దశలో ఉన్నాయి. వీటి మధ్యలో మరో కొత్త సినిమాని మొదలుపెట్టారు. అదే... 'వినోదయ సిత్తం' రీమేక్. తమిళంలో విజయవంతమైన ఈ సినిమా తెలుగు రీమేక్లో తన మేనల్లుడు సాయి తేజ్తో కలిసి నటిస్తున్నారు పవన్కల్యాణ్. ఇప్పటికే ఈ చిత్రానికి కొబ్బరికాయా కూడా కొట్టారు. కానీ ఆ తర్వాతే ఏమి అప్డేట్స్ లేవు. ఇలా అభిమానులను ఎప్పటి నుంచో ఊరిస్తున్న ఈ సినిమా.. కథలో మార్పులు డేట్స్ సర్దుబాట్లు.. ఇలా పలు కారణాల వల్ల ఆలస్యం అవుతూ వస్తోంది. అయితే తాజాగా మరో వార్త ఒకటి బయటకు వచ్చింది. అదేంటంటే కథలో మార్పులు జరుగుతున్నాయని క్లారిటీ వచ్చింది. అయితే ఒరిజినల్ స్క్రిప్ట్ దెబ్బ తినకుండా మెయిన్ థీమ్ అలానే ఉండేలా చేస్తున్నారని తెలిసింది. ఏదేమైనప్పటికీ ఈ చిన్న అప్డేట్ వచ్చేసరికి మళ్లీ సినిమాపై ఆడియెన్స్‌కు ఆసక్తి పెరిగిపోయింది. ఎప్పుడు వస్తుందాని తెగ ఆరాటపడుతున్నారు. మాతృకని తెరకెక్కించిన సముద్రఖని ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. త్రివిక్రమ్ రచన చేశారు. ఇందులో పవన్కల్యాణ్ మనిషి రూపంలోని దేవుడిగా కనిపిస్తారని సమాచారం. ఇకపోతే పవన్ చేస్తున్న సినిమాల్లో ఒకటి క్రిష్ దర్శకత్వంలో రూపొందుతున్న 'హరిహర వీరమల్లు'. చారిత్రక నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో పవన్ గజదొంగగా కనిపించనున్నారు.ఈ సినిమా చిత్రీకరణ పూర్తయిన వెంటనే తమిళంలో మంచి విజయాన్ని అందుకున్న ఈ 'వినోదయ సిత్తం' రీమేక్లో నటిస్తారని తెలిసింది. మరోవైపు హరీశ్ శంకర్తో భవదీయుడు భగత్సింగ్ పట్టాలెక్కించనున్నారు.






# బుట్టబొమ్మ ట్రైలర్ విడుదల

### గ్రామీణ నేపథ్యంలో లవ్‌స్టోరీ

అనిఖా సురేంద్రన్ హీరోయిన్ గా తెలుగులో నటించిన మొదటి సినిమా 'బుట్టబొమ్మ'. ఫిబ్రవరి 4వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ మూవీ ట్రైలర్ ను మేకర్స్ వదిలారు. హీరో విశ్వక్ సేన్ ట్రైలర్ ను రిలీజ్ చేశాడు. గ్రామీణస్థాయిలో ఉండే ప్రేమ కథగా ట్రైలర్ ఆకట్టుకుంటోంది. సూర్య వశిష్ఠ, అనిఖ ప్రేమికులుగా నటించిన ఈ సినిమాలో, ప్రతినాయకుడిగా అర్జున్ దాస్ కనిపించనున్నాడు. శౌరి దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రాన్నిసితార ఎంటర్‌టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థలు కలిసి నిర్మిస్తున్నాయి. గోపీసుందర్ సంగీతం అందిస్తున్నాడు. నవ్య స్వామి, నర్రా శ్రీను, పమ్మి సాయి, మిర్చి కిరణ్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. కొత్త దర్శకుడు శౌరి చంద్రశేఖర్ టీ రమేష్ తెరకెక్కించగా.. సితార నాగవంశీ - త్రివిక్రమ్ సంయుక్తంగా నిర్మించారు. గ్రామీణ నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథ.. మధ్యలో వచ్చిన ఓ వ్యక్తి సృష్టించే అల్లకల్లోలం చుట్టూ తిరిగే ఈ సినిమా ఫిబ్రవరి నాలుగో తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతుంది. ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్ ను శనివారం రిలీజ్ చేసిందీ చిత్ర బృందం. అయితే ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించి మరీ ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమానికి దర్శక నిర్మాతలతో పాటు నటీనటులు హాజరు అయ్యారు.

# రైటర్ పద్మభూషణ్‌గా సుహాస్

ఇటీవలే అడివిశేష్ నటించిన హిట్ 2లో కీలక పాత్రలో నటించాడు కలర్‌ఫొటో ఫేం సుహాస్. ఈ యువ నటుడు ప్రస్తుతం రైటర్ పద్మభూషణ్‌గా కనిపించబోతున్నాడు. ఫన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ మూవీ ఫిబ్రవరి 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రమోషన్స్ ప్లాన్ ను మొదలు పెట్టింది సుహాస్ టీం. తెలుగు రాష్ట్రాల్లో ప్రీరిలీజ్ స్క్రీనింగ్స్ ఏర్పాటు చేశారు. విజయవాడ నుంచి ప్రమోషన్ ఎ÷-లాన్ షురూ చేశారు. దీంతోపాటు గుంటూరు, భీమవరం, కాకినాడ, వైజాగ్, హైదరాబాద్‌లో ప్రమోషనల్ టూర్ ప్లాన్ చేశారు. సినిమా పట్ల మేకర్స్ ఫుల్ కాన్ఫిడెంట్‌గా ఉన్నట్టు ఈ షోస్ ద్వారా తెలుస్తోందంటున్నారు సినీ జనాలు. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. మరి రైటర్ పద్మభూషణ్‌గా సుహాస్ ఎలా ఎంటర్‌టైన్ చేస్తాడనేది చూడాలి. ఈ మూవీలో వృత్తిపరమైన కష్టాలు ఎదుర్కొనే అప్‌కమింగ్ రైటర్‌గా కనిపించనున్నాడు సుహాస్. ఈ సినిమాతో డైరెక్టర్‌గా షణ్ముఖ ప్రశాంత్ తన అదృష్టాన్ని పరీక్షించుకో బోతున్నాడు. ఈ చిత్రంలో ఆశిష్ విద్యార్థి, రోహిణి మొల్లేటి, గోపరాజు రమణ, శ్రీ గౌరి ప్రియ ఇతర నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. జీ మనోహరన్ సమర్పణలో లహరి ఫిలిమ్స్ -ఛాయ్ బిస్కెట్ ఫిలిమ్స్ బ్యానర్లపై అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, చంద్రు మనోహర్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు శేఖర్ చంద్ర, కల్యాణ్ నాయక్ సంగీతం అందిస్తున్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in